

# అన్నయ్య చేసిన మేలు

కథానిక

పి. వి. పల్లి

నాకు యిరవై ఒకటో సంవత్సరం దాటగానే వివాహంకూడా జరిపించారు పెద్దలు. బి. ఏ. పూర్తిచేదామనే పట్టుదలగా చదివాను. మా ఆవిడ కాస్త అప్పుడప్పుడు చదువుకి అభ్యంతరాలుకలిగిస్తున్నా పట్టుదలవదలలేదు. అయితేనేం ఆ లెక్చరర్ ఎవడో-బహుశా నన్ను పెర్సనల్‌గా తెల్సివుంటుంది. రెండుమార్కులు తగ్గించాడు. దాంతో ఎవరికీ నా నెంబరు వార్తాపత్రికలలో కనిపించలేదు. ఇహ మా నాన్న ఒకటే గోల- "అందుకే పెళ్ళిచెయ్యనన్నాను" అని.

"అయితే యిప్పుడేం పోయిందీ- మళ్ళీ సంవత్సరం పూర్తి చేస్తాడు" అన్నది అమ్మ.

"సంవత్సరందాకా యెందుకూ. సెప్టెంబరు వున్నదిగా" అని భరోసా యిచ్చాడన్నయ్య.

ఒదిన ముసిముసినవ్వులు నవ్వడంచూసి, ఒళ్లు మండింది. వాళ్ళాయన స్కూలుఫైనలులోనే సీనియరుక్లాసు చదివాడు. ఆ విషయం అనేద్దామనుకున్నాను. మళ్ళీ తగ్గాను ఎందుకని. అయినా అన్నయ్యపట్ల అభిమానంకొద్దీ వూరుకున్నాను.

"ఓరే రామూ! ఏపార్టు వుండిపోయిందిరా?"

"సెకండుపార్టు."

"పోనీలే. యీ నాలుగునెలలూ జాగ్రత్తగా చదివు తేసరి."

"అలాగే" అని నా రూంలోకి పోయాను.

వేడివేడి కాఫీ త్రాగడంతోటే ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది.మా ఆవిడ ముస్తాబవడం చూచి విస్తుపోయాను. పోనీ పాసయ్యాను కనకనా - బహుమానమన్న మిషతో సినిమాకు తీసికెళ్ళడానికి? యేం మొహంపెట్టుకుని మా ఉభయులం బాల్కనీలో కూచుంటాం? కొత్తపిక్చరే కావచ్చును- మంచిదే కావచ్చును.

నా ముఖ కవళికలని గమనించింది సరూ.

మూతిముడిచింది. "పోనీలెండి! యింతేనా?" అన్నది కాళీచేసిన గ్లాసు యింట్లోకిపట్టుకుపోతూ. యిదే సమయమనుకుని వీధిలోకి వుడాయించాను.

* * *

కాల్చిన సిగరెట్టుముక్క పారేసి, మందారమొక్కవంక దీర్ఘంగాచూస్తున్నాను. ఇంతలో కామేశం వెనకగా వచ్చి, "కంగ్రాటులేషన్స్" అన్నాడు. త్రుళ్ళిపడ్డాను.

"ఎందుకూ కంగ్రాట్యులేషన్స్??అన్నా.

"పాసైనందుకు."

అరె! నా నెంబరు కనిపించందే!

"నీకెవరు చెప్పారు?"

"మొదటినుండీ అనుకుంటున్నదే గదటోయ్. అసలు నేను రిజల్ట్సు చూడ్డమే లేదు. ఎలాగూ- క్లాసువచ్చినా రాకపోయినా ప్యాసు ష్యూర్ కదా అని."

"ఓయ్ వెర్రివాడా! మనం రెండోపార్టులో తప్పేం."

"యీజిట్" అన్నాడు బ్రహ్మాండం బ్రద్దలయ్యేట్లు మొహంపెట్టి.

"అవున"న్నా.

"వెధవది. ఆ లెక్చరర్‌కు బుద్ధి లేదు. ఫలానా రామారావుగార్ని పాస్

చెయ్యాలని అనుకోలేదు కాబోలు. చదవక పోయినా ఫస్టుమార్కు యివ్వవలసింది." యిద్దరం ఫకాలున నవ్వుకున్నాం.

"అయితే భాయ్! ఇకముందు కార్యక్రమం యేమిటి?"

"అదేనోయ్ నేనూ ఆలోచిస్తున్నా."

"సరేగాని మా ఆఫీసులో క్లర్కుపోస్టు కాళీ వుంది అప్లికేషన్ పెట్టు. ఆర్డర్ యిస్తా రేపు సాయంత్రానికి."

యేవేవో పిచ్చాపాటీ మాట్లాడుకుని ఏడు గంటలకల్లా యెవరియిళ్ళకివాళ్ళం వెళ్ళాం.

* * *

"ఆంధ్రా బ్యాంకులో కాళీవున్నదట. అప్లికేషన్ పెట్టరాదటరా!"

"అలాగే నాన్నా. మా కామేశంకూడా అందులోనే పనిచేస్తున్నాడు. వాడుకూడా చెప్పాడు కాళీ వున్నదని."

"యేదో యీ వచ్చే పరీక్షలోనైనా పాసైతే అన్నయ్యలాగే బి. యి. డి. చదివి యెక్కడన్నా మేష్టరీ చేసుకోవచ్చును."

"అప్పటి సంగతి యిప్పుడెందుకు నాన్నా!" ముగించాను సంభాషణని.

వక్కపొడి నోట్లో మా ఆవిడ అన్నది-

"పోనీ మావాళ్ళకి వుత్తరం రాయకూడదు టండీ! సింధియాలో యేదన్నా వుద్యోగం చూస్తారు."

"యేం యిక్కడ దొరకలేదనా?"

"అదికాదండీ! మనంతటమనం వుంటే..."

"ఓయబ్బో! రెండోమెట్టుమీద అడుగు వేశావే. యిప్పటినుండే వేరింటి కాపరమేమిటి లెద్దూ."

"ఏం తప్పా?"

"తప్పు-ఒప్పు అలావుంచు. నాలుగురోజుల పాటు యే బాధ్యతాలేకుండా-సరదాగా వుండామనివుంది. అదీగాక యీ చదువు పూర్తి అయితే అప్పుడు యెలాగూ వుండనేవున్నది వేరింటి కాపురం."

"అదికాదండీ! మీ వదినెకి మనం వుండటం యిష్టంలేదు. మీ అన్నయ్య కూడా అదోలా వుంటున్నారు."

"నాన్న వున్నంతకాలం మనకి యేం భయం లేదు. తర్వాతసంగతి ఆలోచిద్దాం."

"యింట్లో వుండొద్దు అంటూంటే చూరట్టుకుని వేలాడడం యెందుకు? మీ నాన్నమాత్రం అన్నయ్యమాటని తోసేస్తారనా."

"అదంతా నీకెందుకు?" కోపంవచ్చింది నాకు.

* * *

పాపాయి పుట్టడం, నేను పాసవడం, రెండూ ఒక్కనాడే జరిగాయి. శుభలేఖ, రిజల్ట్సు వున్న పేపరూ రెండూ మా నాన్న చేతిలోనే పడ్డాయి. ఎంతో సంబరపడిపోయింది మా అమ్మ.

"అయితే బాలసారెకు యెప్పుడు రమ్మని రాశారు?"

నాకు, పరీక్ష పాసయినందుకు అమితానందం కలిగినా, బరువు హెచ్చిందన్న బెంగ బయలు దేరింది మనసులో. ఇక నాన్న అట్టేకాలం బ్రతికేలా లేరు. అన్నయ్యకీ నాకూ, సరిపడదు. అన్నయ్య మంచివాడైనా, ఒదినది అదో తరహా. సరిపెట్టుకుపోదామంటే, మా సరూకు ముక్కున వుంటుంది కోపం. శౌర్యానికీ, రౌద్రానికీ, ఉద్రిక్తతకీ పెట్టింది పేరు. ఆంధ్రుల సహజగుణం-ఆవిడలో మూర్తీభవించింది. అన్యాయం జరిగితే ఒప్పుకోదు. ముక్కుకి సూటిగా పోతానంటుంది.

"అలా అయితే మనకి అన్నం దొరకదం" టాను నేను.

"ఏమైనాసరే - అన్యాయాన్నీ, అధర్మాన్నీ చూస్తూ ఎలావూరుకోవడం?" అంటుంది మా ఆవిడ.

"ఎలాగో సరిపుచ్చుకోవాలి" అంటాను నేను.

"మనం చేతగానివాళ్ళమా?" అంటుం దావిడ.

"చేతనైంది కదా అని వేరుపడిపోవడమా?" అంటాను.

"అన్యాయం జరుగుతుందని తెలిసి యెలా సహించడం?" అంటుం దావిడ.

ఇలా యెన్నోసార్లు మా యిద్దరిమధ్యా వాద ప్రతివాదాలు జరగడం పరిపాటి అయింది. పోనీ ఆవిడ మాటప్రకారం వేరుపడిపోదామా అంటే నాన్నని వొదిలి యెల్లా వుండడం? పోనీ అతన్ని తీసుకపోదామా అంటే అమ్మ మాట?—ఇద్దర్నీ పోషించే బాధ్యత మనకిలేదు.

ఆ మాటకి మా ఆవిడ ఒక్కసారి విరుచుకు పడింది. "తల్లిదండ్రుల్ని పోషించలేని కొడుకెందుకు?" అన్నది. ఆ మాటకి కోపం తెచ్చుకుందామంటే బడ్జెట్టు సరిపోతుందో చాలదో. మొదటనే లోటు బడ్జెట్టయితే ముందుముందు యెలా?

ఆలోచనలతో పిచ్చియెత్తినట్లయింది. మా ఆవిడ వచ్చింతర్వాత ఆలోచించవచ్చని కళ్లు మూసి నిద్రపోయానా రాత్రి.

*   *   *

చాలసారెకు మం అమ్మా, నాన్నా, నేనూ, మా ఒదినె వెళ్ళాం. "పిల్లడు ఎంతో బాగున్నాడని" ఒదినె అసూయపడడం మా ఆవిడకి కష్టమనిపించింది. అయితే ఆవిడ కొడుకు కోతి ఆకారం. మా ఆవిడ ఓసారి ఆ మాటనే అని చెప్పి పొడిచింది కూడాను. అందుకు ప్రతిఫలంగా యీ అసూయ.

మేం వెళ్ళి వచ్చింతర్వాత నెల్లాళ్ళలో మా ఆవిడ గుమ్మంలో అడుగుపెట్టింది పాపాయితో. 'చంద్రం' అని పేరుపెట్టారు మా నాన్న పాపాయికి.

రోజూ మా ఆవిడ రభసచెయ్యడం మానలేదు. "ఇప్పుడు వేరుపడిపోతే బి-యిడి ఎలా కంప్లీటు అవుతుందన్నాను" నేను.

"నేను తెస్తా డబ్బు" అన్నది మా ఆవిడ.

మా నాన్న ప్రక్క గదిలోనుండి కేకవేశారు. వెళ్ళాను.

"ఏమిట్రా ఆ మాటలు. నేను బ్రతికుండగా వీల్లేదు" అన్నారు.

"అలాగే నాన్నా" అన్నాను.

"సరోజా" కేకేశారు మా ఆవిడని. వెళ్ళింది మా ఆవిడ. ఆ గదిలో మేం ముగ్గురం తప్పితే యింకెవ్వరూ లేరు.

"అమ్మా నువ్వు చిన్నదానివి. నీకు తెలీదు. వుండగా మీరు వేరుగా వుండడం సబుబుకాదు. ఆ తరవాత మీ యిష్టం."

"అదికాదు మామయ్యా-బావగారూ, అక్కగారూ మేం ఇక్కడ వుండట యిష్టపడడం లేదు"

"వాళ్ళతో మీరెందుకూ——"

"మొన్న మా అబ్బాయికి తలంటి నీళ్ళు పోస్తూంటే మూల్గుతున్నదావిడ. మీ కొడుక్కి కాఫీ ఇస్తే మూల్గుతుందావిడ... ఇలా ఎన్నో"

"పోనీ నేను చూస్తాగా-అత్తగారు మంచం మీద వుండబట్టిగదా యిపన్నీను."

ఆ ఘడియకి మా వుద్దేశం విరమించుకున్నాం. బి. యిడి. పూర్తికాకముందే మా అమ్మ మమ్మల్ని విడిచింది. మా నాన్న కూడా ఆ పరిస్థితికి వచ్చారు. ఆర్థికంగా సహాయం లభించలేదు. మా నాన్న నాకోసం దాచిన సొమ్ము ఖర్చయిపోయింది. మా ఆవిడ తెచ్చుకున్న వంద రూపాయిలు మాత్రం మిగిలివున్నాయి. ఇంకా రెండున్నర నెలలకాలం గడవాలి. కామేశానికి యింకా నేను రెండువందలరూపాయలు ఇవ్వాలి వాడు అడగనేలేదు. అలాగని వూరుకోవడం యేం బాగుంటుంది?

*   *   *

"మీరు చెప్పలేకపోయారా వేరుపొమ్మని"

"అదికాదే వాడు వెళ్ళిపోతే వీలులేదు. రేప్రొద్దున్న నూటఏభై రూపాయల వుద్యోగం అవుతుంది వాడికి. అందుచేత మంచి చేసుకోవాలి."

"పోనిద్దురూ - మనకి సరిపోకపోదు - మనం ముగ్గురమేకదూ వున్నాం."

"కుర్రాడి చదువుఅయినా పూర్తి అయితే మంచిదికదూ?"

"ఏమో మీ యిష్టం. నాకు మాత్రం యిష్టం లేదు."

"నీకు మరొకటి యిష్టమటే. ఆ తరవాత నీకే తెలుస్తుంది. యిప్పటినుండి వాళ్ళని మంచి మాటలాడి మచ్చికచెయ్యాలి. మనం యెంతో అభిమానం వున్నట్లు మెలగాలి."

"అవును-అదీ నిజమే. రేపటినుండి దాన్ని ఏ పనీ చెయ్యనివ్వను. అన్ని పనులూ నేనే చేస్తూంటాను. ఒరే బాబూ-చిన్నాన్న కొడుకుని ఆడించాలి సుమా?"

"అలాగే అమ్మా" అన్నాడు శంకరుడు.

*   *   *

"పదకొండు కొట్టారా?"

"అవును."

"పన్నెండో తారీకున" అన్నారు నాన్న.

కలకన్నా నసుకొన్నాను. ఉదయం లేచిన దగ్గరనుండీ మా ఒదినె, అన్నయ్యల ప్రవర్తన నాకు అనుమానం కలిగించింది. అయినా రాత్రి నేను విన్నది నిజమని ధృవపరచ లేకుండా వున్నాయి. సరే ఏం జరిగితే అదే జరుగుతుం దనుకున్నాను. మా ఆవిడతో మాత్రం చెప్పలేదు. నిలదీసి అడుగుతుంది. ఇంతకీ యిది నిజమో-కాదో.

మా తండ్రికూడా మమ్మల్ని ఒదిలేశాడు. "ఇక మన ప్రయాణం మాటేమిటి?" అన్నది మా ఆవిడ.

"పరీక్ష ప్యాసో, ఫెయిలో తెలియకుండానే యెక్కడా వుద్యోగమన్నా దొరక్కుండానే-ప్రయాణమా?"

"మీరెప్పుడూ యింతేనండీ—" ముఖం చిట్లించింది.

"యీసారి మావాళ్ళయింటికెళ్ళి రానేరాను" మురిపించింది.

"అనుగక్కుక్క మీరు అనుమానాలే - మనం స్వయం-పోషకులం కాకమానం. నాది పూచీ-బయల్దేరండి-" అన్నదిమళ్ళీ.

"సరేలే - చూదాం..." అని సరిపెట్టాను అప్పటికి.

రాజావారి కాలేజీలో ఫోర్తుఫారానికి ఒక టీచరు కావాలని ప్రకటించబడింది. అప్లికేషను పెట్టాను. వెంటనే యిచ్చారు. మరో పదిదినాల్లో బి. యి. డి. ఫలితాలు వచ్చాయి. ఫస్టుక్లాసు వచ్చింది.

మా అన్నయ్య ఉప్పొంగిపోయాడు.

"నాన్నే గనకవుంటే యెంత సంతోషించేవారో?" ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు.

"మరిదిగారు ఒక ఉద్యోగి అయ్యాడంటే అత్తగారు—చచ్చిస్వర్గాన్నున్నారు కాని ఎంతో మురిసిపోయేవారు. 'వాడొక ఉద్యోగిఅయితే చూడాలనివుంది'-అనేవారు" అన్నది వదినె.

ఏవిధంగానూ పూర్వంలా యిప్పుడు యింట్లో వ్యతిరేకభావం కనపడడంలేదు. యిల్లాంటి సమయం యెలా బయలుదేరడం? నలుగురూ నాలుగు విధాలా అంటారు. నన్నే కాదంటారు.

మా ఆవిడకి వెళ్ళిపోదామన్న పట్టుదలతప్పితే యింకోటిలేదు. అయినా అన్నయ్య వెళ్ళొద్దని యెన్నోసార్లు చెప్పాడు. వుద్యోగంకూడా యీవూళ్లోనే దొరికిందాయెను. యేమైనా నేను వెళ్ళిపోడానికి నిశ్చయించలేను. వుద్యోగంలో ప్రవేశించి అప్పుడే ఎనిమిది నెలలకాలం అయింది.

మా ఆవిడ పుట్టింటికెళతానంది. ఏడోనెల వచ్చిందికూడా. వాళ్ళఅన్నయ్య రానేవచ్చాడు. నేను అడ్డుపెట్టలేదు.

రైలుబండి యెక్కుతూ అన్నది 'జాగ్రత్త' అని మరోసారి. ఆ 'జాగ్రత్త'లో యిమిడివున్నది యేమంటే—

ఒకటి: తెచ్చినజీతంలో యీ ఖైకంటే ఎక్కువ యివ్వవద్దని. మిగతానూరూ బ్యాంకులో వేయమని. భవిష్యత్తుకి పనికివస్తుందట.

రెండు: యింటిదగ్గర భోజనం సరిపడకపోతే హోటలుకు వెళ్ళమని. ఏపూటా యిబ్బంది పడవద్దని.

మూడు: దుబారాఖర్చులు పెటవద్దని, శంకరుడికి పూర్వంలా చట్టాలు కుట్టించవద్దని. దానికి కారణం రెండో కానుపు ఫలిస్తూంది గనక మన భవిష్యత్తుని ఆలోచించమని.

"అలాగే" అన్నాను. రైలుకదిలింది. నేను యింటికి వచ్చాను.

* * *

పెద్దమామయ్య వచ్చాడు - సాయంత్రం నేను కాలేజీనుండి యింటికివచ్చేసరికి వీధిగుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు.

"ఏం మామయ్యా యెంతసేపయిందివచ్చి?" పలకరించా సైకిలు దిగుతూ.

శంకరుణ్ణి సైకిలుదింపి యింట్లో పెట్టిసైకిలుని యివతలికి వచ్చాను.

"అంతా కులాసాయేనా?" మళ్ళీప్రశ్నించాను.

"అంతా కులాసా" అన్నాడు మామయ్య.

ఇంతట్లో అన్నయ్య వచ్చాడు. ముగ్గురం యేదో లోకాభిరామాయణంలో పడ్డాం.

భోజనాలయినాయి. వెన్నెట్లో కూచున్నాం ముగ్గురం. శంకరుడు తమలపాకులు, చెక్కలు పళ్ళెంలోపోసి తెచ్చి ముందుంచాడు. నములుతున్నాం.

"జానురా-రామూ-యిదిమంచిపనికాదురా."

ప్రశ్నార్థకంగా చూచాను మామయ్యవేపు.

"నువ్వు వేరుపడతానంటున్నావటగా—" అన్నాడు మళ్ళీ నాసంశయం తీరినట్లు.

"నీకెవరు చెప్పారు?"

"తెల్సిందిలే— అది మంచిపనికాదు. మీ నాన్నగాని, అమ్మగానిలేరు. మీకుమీరే పెద్దలయిపోయారు. మీ అన్నయ్యగాని; మీ వదినెగాని మిమ్మల్ని వేరుండమని నిర్బంధించారా? ఏమేనా యిబ్బందులు పెడుతున్నారా? లేదాయె! మరి యెందుకు పుట్టిందీ దుర్బుద్ధి? అంతా కలిసివుండడం మంచిది. ఐకమత్యంగూర్చి నీకు నేను చెప్పేది యేదీలేదు. నువ్వూచదువుకున్నవాడివి. మేష్టరువికూడాను. పిల్లలు కొట్లాడుకొంటూంటే కలిసి మెలిసి వుండమని ఉపోద్ఘాతిస్తావుగదా — అదే వాళ్ళు దూరదృష్టిలేనివాళ్ళు వాళ్ళమాటల్ని మనంపట్టించుకోకూడదు. వాళు యేమేమో అంటారు మీ యిద్దరిజీతం యిప్పుడు రెండువందలయాభై దాకా వుంటుందా?" ప్రశ్నార్థకంగా అన్నయ్యవేపు చూశాడు మామయ్య.

"అంతే" అన్నాడన్నయ్య.

"ఆ రెండువందలయాభయితోటీ యెంతో కుటుంబాన్ని యీడవ్వొచ్చు. మా కాలంలో యెంతో ఐకమత్యం వుండేది. కుర్రాళ్ళం పెద్దలు చెప్పినట్లు వినేవాళ్ళం. ఐక్యతతో సాధించలేనిది లేదు. దానివల్లనేకదా మనం స్వతంత్రం సంపాదించాం. నేను యిలాటివి ఎన్నో చెప్పగలను! అన్నీ నీకు తెల్సినవే. త్రుణీకారభావం కూడదు. కష్టపడి పనిచెయ్యాలి. అన్నయ్యనీ, వదినెనీ ఎంతో గౌరవించాలి. లక్ష్మణుడు శ్రీరాముణ్ణీ, సీతాదేవినీ గౌరవించలేదూ?"

"చికాకనిపించిందినాకు."

"యింతకీ నువ్వనేదేమిటి?" అన్నాను.

"యేంలేదు. కల్సిమెల్సి వుండమని, ఏదన్నా వ్యతిరేకతవుంటే ఆ తగువు తీర్చడానికి మాబోటి పెద్దలం యింకా వున్నాంకదా—"

"నావుద్దేశం అలా యెప్పుడూలేదు. అంతా అన్నయ్యమీదే వొదిలేశాను. నా జీతంలో చిల్లిగవ్వకూడా మిగుల్చుకోకుండా యిచ్చేస్తున్నాను"

"అలావుండాలి మరి-"

"అంతేపాపం - సినిమాకి వెళ్ళినా వాళ్ళ అన్నయ్యనే అడుగుతాడు మహారాజుకొడుకు-" సానుభూతి వెళ్ళడించింది వదినె.

ఉదయం వెళ్ళిపోతూ మామయ్య మరోసారి వార్నింగుయిచ్చి, నాచేత ఒట్టు వేయించుకుని మరీ వెళ్ళాడు.

* * *

"ఇక్కడ నేను క్షేమం. చంద్రం క్షేమం. పాపాయి క్షేమం. ఈవూళ్ళో కాలేజీలో హిష్టరీ టీచరు కావాలట అన్నయ్య చెప్పాడు. అప్లికేషను పెట్టండి. ఇల్లుకూడా మాట్లాడతాను." ఇదీ ఉత్తరంలోని సారాంశం.

ఈ వుత్తరానికి యేం జవాబివ్వాలో నాకు తోచిందికాదు.

"నువ్వన్నది నిజంగావచ్చును. కాని అన్నయ్య పెద్దవాడు యిప్పుడు నాకు ఏలోపం జరగకుండా చూస్తున్నారుకూడా. నిన్ను వెంటనే రమ్మనీ, పిల్లల్ని చూడాలని వున్నదనీ రాయమన్నారు. వెంటనే రావాలి. నీ వుద్దేశం ప్రస్తుతానికి విరమించడం మంచిది."—వుత్తరం రాసి పోస్టులో వేశాను.

మళ్ళీ వారంరోజుల్లో మరోకవరు వచ్చింది.

"మీరు మరీ చిన్నవారయిపోతున్నారు. తేనె పూసిన కత్తుల్ని జాగ్రత్తగా చూడాలి. మనల్ని అభిమానంతో చూస్తున్నారనుకోవడం పొరబాటు. అదంతా స్వార్థం. మనం స్వయంపోషకులం కాగలం. కాకపోయినా సరిపెట్టుకుందాం. ఇక్కడ యిల్లు చూశాను. ఇరవైరూపాయిలు అద్దె అన్నిసదుపాయాలూ వున్నాయి. పాపాయి చంద్రం-క్షేమం. చంద్రం మిమ్మల్ని రమ్మంటున్నాడు. వెంటనేరండి" ఇదీవిషయం.

ఎంత ఆలోచించినా మనస్సు వుత్తరాన్ని సమర్థించడంలేదు. ఐనా నాన్నమాట మామయ్య మాట యెల్లా కాదనడం? సరూ వెళ్ళిపోయి అప్పుడే ఆరేడునెలలు కావస్తున్నది. రానంటుంది కదా! వెళ్ళి తీసుకొస్తాను.

వెళ్ళాను రెండోరోజున ససేమిరా-వేరుపడదామంటుంది. ఏం చెయ్యడం? బావమరదులూ-అత్తగారూ, మామగారూ అందరూ యిదే మాట.

అన్నయ్యలోనూ, ఒదినెలోనూ ఏమీదోషం కనబడడంలేదు కదా!

ఎలాగయితేనేం ఆరునెలలు వాయిదాకోరి సరూని తీసుకుని బయలుదేరాను.

నేనూ సరూ గుమ్మం యెక్కాం. కాని అన్నయ్యకాని, ఒదినెకాని పలకరించలేదు. నాకు కష్టమనిపించింది. శంకరుడుమాత్రం 'చిన్నాన్న' అంటూ దగ్గిరికి వచ్చాడు.

మా గదిలోకి వెళ్లాం. పెట్టె బెడ్డింగు పెట్టేసి కూలివాడు వెళ్ళిపోయాడు.

సరూకి దూరదృష్టి యెక్కువ. ఎంతటిసమస్యనైనా యిట్టే పరిష్కరిస్తుంది. అదీకాక "జాగ్రత్త"లో అందెవేసిన చెయ్యి తను పుట్టింటికి వెళుతున్నప్పుడు తన గొలుసు, గాజులు యిక్కడనే వుంచి వెళ్లింది. పెట్టెలోనే వుంచాను. సరూ రాగానే పెట్టె తాళాలు అడిగింది యిచ్చాను. తాళం తీయబోయింది. విరగగొట్టబడి వున్నది తాళం.

"ఇదేమండీ - తాళం బద్దలు కొట్టేరూ?" ప్రశ్నిస్తూ తలుపుతీసింది. బట్టలన్నీ చిందరవందరగా వున్నాయి. అడుగునవుంచిన గొలుసూ, గాజులూలేవు.

"ఏమైనాయ"ని ప్రశ్నించింది.

రూపాయి మొహంవేశాను. నాకు యేమీ పాలుపోవటంలేదు. ఏమైనాయా అని ఆలోచనలో పడ్డాను.

"మాట్లాడరేం?" అన్నది సరూ గట్టిగానే.

"అందులోనే వుంచాను. ఏమైనాయంటే- ఏం చెప్పేది?"

"అర్థమైందా?" అన్నది...

మనస్సు చివుక్కుమన్నది. ఏమనడానికీ నోరు రాలేదు. ఆ విషయంలో మరి అనుమానం అక్కరలేదు.

"వుండే గోలచెయ్యకు" అన్నాను.

"అవును! ఇది గోల!" దీర్ఘంగా మూల్గింది.

నేను వీధిలోకి వెళిపోయాను. కాఫీక్లబ్బుకు పోతున్న కామేశాన్ని కేకేశాను.

"ఎప్పుడొచ్చావ్?"

"రాత్రి బండిలో—"

"ఏమిటి విశేషాలు-అలా వున్నావేం?"

కథంతా "శ్రీ" దగ్గరనుంచి చివరిదాకా చెప్పాను. అతనుకూడా సరూనే సమర్థించాడు.

"ఒరేభాయ్-ఇవాళకూడా ఆఫీసుకు రాను" అని చెప్పి జేబులోని కాయితంమీద సెలవు దరఖాస్తు రాసి వాడి కిచ్చేశాను.

మనస్సు వికావికలమైంది. ఇంత ద్రోహం చేశాడు అన్నయ్య అనుకున్నాను. మనస్సులో వుంచుకున్నది బయటకు వెడలగ్రక్కడం మంచిదనిపించింది.

"అన్నయ్యా-పెట్టెలోని గొలుసూ, గాజులూ యేమైనాయ్?" కాస్త ఘాటుగా అడిగాను. ఉద్రేకం హెచ్చింది.

"ఏ పెట్టెలో? నాకేం తెలీదే—"

"ఒదినా-అవి యేమైనాయ్?—"

"ఏమిటి?—"

"పెట్టెలోని గొలుసూ గాజులూ—"

"ఆరి భగవంతుడా! యిదికూడానా? అదేమో నాకేంతెల్సు? నీవు పట్టుకుపోయి నీ పెళ్ళాని కిచ్చావేమో" అని విరుచుకుపడ్డది.

మరి వాదన అనవసరమనుకున్నాను. నా గదిలోకిపోయి యీజీఛైరులో నడుంవాల్చాను.

శంకరుడు వచ్చాడు. "చినాన్న-అమ్మ తీసింది" అన్నాడు. "ఏమిటి!" అన్నాను.

"పిన్ని మెడలో వేసుకుండేది అవీ—"

సరూ చెప్పినది అక్షరాలా నిజం. అనుమానం అక్కరలేదు.

"సరూ-" పిలిచాను.

"నువ్వు గెలిచావు" అన్నాను.

"నాకు తెల్సును" అన్నది.

ఆనాడు నేను కల అనుకున్నది నిజమనుకున్నాను. మరునాడే సరూ పుట్టింటికి వెళ్ళింది. రాజీనామా దాఖలుచేసి నేనూ బయలుదేరాను.